

బీఎంటీసీ ఎలక్ట్రిక్ బస్సు దగ్ధం

బెంగళూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరంలో సోమవారం రాత్రి భారీ వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. ఇదే సమయంలో బీఎంటీసీ ఎ లక్ట్రిక్ బస్సు ఒకటి జలమండలి కార్యాలయం వద్ద మంటల్లో కాలిపోయింది. న గర సంచార పోలీసులు ఈ విషయాన్ని ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. బస్సు కాలిపోవడంతో హెబ్బాళ సర్కిల్ మీదుగా ట్రాఫిక్ సంచారం సాగింది. సోమవారం రాత్రి సుమారు 10.50 గంటలకు షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగడంతో అప్రమత్తమైన డ్రైవర్ వెంటనే ప్రయాణికులను దింపేశారు. కొద్దిసేపటికే బస్సు మొత్తం మంటలు వ్యాపించడంతో దగ్ధమైంది.

అక్కడ మునక..ఇక్కడ బెట్ట..!



గంగావతి సమీపంలో నీట మునిగిన పంటపొలాలు





హగరి బొమ్మనహల్ వద్ద కొబ్బరి మొక్కలకు ట్యాంకర్ నీటితో తడి

- వర్షాధార పంటల సాగు రైతుల కన్నీరు
- తుంగభద్ర నది సమీపంలో మునుగుతున్న పంటలు

బళ్లారి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడిచిపోయింది. ఇప్పటికే అటు మెట్ట రైతులు, తరి భూములు ఉన్న రైతులు వ్యవసాయ పనుల్లో బిజీగా గడపాల్సిన సమయం. కానీ, ఈసారి భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. బళ్లారి చుట్టు పక్కల ప్రాంతాల్లోనే ఒకవైపు వరదలతో పంటలు జలమయమై ఇబ్బందులు పడుతున్న రైతులు.. మరోవైపు విత్తనం వేయడానికి, వేసిన పంటను కాపాడుకోవడానికి వర్షం కోసం ఎదురు చూస్తున్న రైతులు తల్లడిల్లుతున్నారు. మెట్ట ప్రాంతాల్లో చినుకు జాడ లేక రైతులు కన్నీరు పెడుతున్నారు. ఒక వైపు తుంగభద్ర జలాశయం నిండి నీటిని నదికి వదలడంతో సమీపంలోని పంట పొలాలు, ఊళ్లు మునిగి పోతున్నాయి. మరోవైపు వర్షాధారం కింద సాగు చేయాల్సిన పొలాల్లో విత్తు పడలేదు. అరకొర తడికి విత్తిన విత్తనం నేలలోనే కలిసిపోయింది. ఇక వేరుశనగ పంట సాగుకు వీలు కాదు. విత్తినా పంట పండదు. తడి పంటలు జొన్న, పత్తి, ఇతరత్రా సాగు కూడా వీలు కాకుండా పోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇది ప్రకృతి విచిత్రం కాకపోతే.. వరదలతో కొన్ని చోట్ల గ్రామాలు నీటిలో చిక్కుకున్నాయి. తుంగభద్ర నది పొంగి ప్రవహిస్తుంటే నదీప్రవాహం పక్కన ఉండే పంట పొలాలు నీట మునిగిపోతున్నాయి. ఒక పక్క వంకలు వాగులు పొంగి పొర్లుతూ ఉంటే.. మరి కొన్ని చోట్ల వర్షాలు కురవక పంటలు సాగు కాక రైతులు ఆవేదన చెందుతున్నారు. బళ్లారి, విజయనగర, రాయచూరు. కొప్పళ, చిత్రదుర్గం తదితర ప్రాంతాల్లో ఈ ఏడాది వర్షాలు అత్యంత అల్పంగా కురిశాయి. వర్షాధారం కింద పంటలు సాగుకాకపోవడంతో పొలాలు బీళ్లుగా మారుతున్నాయి. అరకొరగా కురిసిన వానలకు వేసుకున్న పంటలు ఎండిపోతుంటే కొందరు రైతులు ట్యాంకర్లతో తడిపి పంటను కాపాడుకుంటున్నారు. మరి కొందరు తుంగభద్ర నదిలో పైపులు వేసి మోటార్లతో తోడుకుంటూ పంటలను కాపాడుకుంటున్నారు. తడిభూముల రైతులు ఏదోలా పంట పండించుకుంటామనే నమ్మకంతో ఉంటే వర్షాధార రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. విజయనగర, బళ్లారి, రాయచూరు, కొప్పళ, చిత్రదుర్గం, జిల్లాలకు కొంత తుంగభద్ర జలాశయం నీరు అందుతుంటే.. చాలా వరకు భూములు వర్షాధారం కిందే సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. జూన్ తొలివారంలోనే అడపాదడపా వానలు కురిసాయే కాని ఇంత వరకూ జాడే లేదు. తొక్కలకోట, హడగలి, కూడ్లిగి, చిత్రదుర్గం, బళ్లారి, సిరుగుప్ప, కొప్పళ, గంగావతి, తదితర ప్రాంతాల్లో వర్షాధారం కింద పంట సాగు కాలేదు. గతంతో పోల్చితే విజయనగరంలో 17 శాతం, బళ్లారి జిల్లాలో 14 శాతం, కొప్పళ జిల్లాలో 15 శాతం, రాయచూరు జిల్లాలో 11 శాతం, చిత్రదుర్గంలో 15శాతం వర్షం తగ్గిందని వాతావరణ విపత్తు అధికారులు చెబుతున్నారు. విజయనగర జిల్లాలో తుంగభద్ర జలాశయం, నది పొంగి పొర్లుతుంటే ఇదే జిల్లాలో ఉండే మెట్ట భూమి రైతులు వర్షం లేక పంటలు సాగు చేయక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కంప్లి వద్ద నీట మునిగిన పొలాలు



సిరుగుప్ప వద్ద నీటిని పైపుల ద్వారా పంటలకు అందిస్తున్న రైతులు

మరో పాదయాత్రకు బీజేపీ కసరత్తు

- చలో మైసూరు విజయంతో ఉత్సాహం
- వాల్మీకి కార్పొరేషన్ అవినీతిపై ఉత్తర కర్ణాటకలో..

బెంగళూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ముడా ఇంటి స్థలాల అక్రమాలలో ముఖ్యమంత్రి కుటుంబానికి భాగస్వామ్యం ఉందని నిరసిస్తూ బీజేపీ చేపట్టిన చలో మైసూరు పాదయాత్ర విజయవంతంగా సాగుతున్న తరుణంలో మరో యాత్ర చేపట్టేందుకు కసరత్తు చేస్తున్నారు. ముడా అక్రమాలలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య రాజీనామా చేయాలని, సీబీఐ ద్వారా విచారణ జరపాలని బీజేపీ - జేడీఎస్ సంయుక్తంగా చేపట్టిన పాదయాత్ర విజయవంతంగా సాగుతోంది. మరో మూడు రోజుల్లో యాత్ర మైసూరులో ముగుస్తుంది. ఆ వెంటనే మరో పాదయాత్ర చేయాలని బీజేపీ నాయకులు సిద్ధమవుతున్నారు. వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో అవినీతి జరిగిందని స్వయంగా సీఎం సిద్దరామయ్య శాసనసభలో అంగీకరించారు. ఇప్పటికే మంత్రి నాగేంద్ర రాజీనామా చేశారు. దీంతో వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ అవినీతిని నిరసిస్తూ బళ్లారిలో ర్యాలీ చేపట్టాలని భావిస్తున్నారు. బీదర్ నుంచి బళ్లారి లేదా, బళ్లారి నుంచి చిత్రదుర్గకు పాదయాత్ర చేపట్టాలని ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఢిల్లీలో పార్టీ అగ్రనేతలకు సమాచారం ఇచ్చి కోర్ కమిటీతో చర్చించి పాదయాత్ర నిర్వహించనున్నట్టు మాజీ మంత్రి శ్రీరాములు తెలిపారు. మంగళవారం ఆయన బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ ఉత్తర కర్ణాటక ప్రాంతానికి అన్ని విధాలా అన్యాయం జరుగుతోందని, యాదగిరిలో సబ్‌ఇన్‌స్పెక్టర్ పరశురామ్ ఆకస్మిక మృతికి కాంగ్రెస్ ఎమ్మెల్యే వేధింపులే కారణమని ఆరోపించారు. కల్యాణ కర్ణాటకకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన రూ.25వేల కోట్ల బడ్జెట్ గ్రాంట్లను గ్యారెంటీలకు వినియోగిస్తున్నారని అన్నారు. వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో కోట్లాది రూపాయల అవినీతితో అట్టడుగు వర్గాలకు అందాల్సిన సాయం దూరమైందన్నారు. కల్యాణ కర్ణాటక ప్రాంతంలో పాదయాత్ర ద్వారా ప్రభుత్వ తప్పిదాలను వెలుగులోకి తెస్తామని తెలిపారు.

అక్రమాల్లో సీఎంకు భాగస్వామ్యం

- ముడాపై విచారణ ఎదుర్కోవాల్సిందే
- పోరాటం కొనసాగిస్తాం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర

బెంగళూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ముడా అక్రమాలలో ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు భాగస్వామ్యం ఉందని, ఆయన నిందితుడే అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర ఆరోపించారు. చలో మైసూరు పాదయాత్ర నాల్గో రోజు మంగళవారం అదే ఉత్సాహంలో కొనసాగింది. మద్దూరులో ప్రజలను ఉద్దేశించి విజయేంద్ర మాట్లాడుతూ మైసూరులో వేల కోట్లు ముడా రూపంలో అవినీతి జరిగిందని, వాల్మీకి కార్పొరేషన్‌లో ఇష్టారాజ్యంగా నిధులు బదిలీ చేశారని, అక్రమాలు జరిగేందుకు సీఎం సిద్దరామయ్య కారణమని అన్నారు. ఆయన రాజీనామా చేసేవరకు పోరాటం ఆపేది లేదన్నారు. వాల్మీకి కార్పొరేషన్ అవినీతి కేసులో మాజీ మంత్రి నాగేంద్ర, ఛైర్మన్ అశోక్ దద్దల్ పేర్లు లేకుండా చార్జ్‌షీట్ నమోదు చేయడం సరికాదన్నారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం ఏర్పాటు చేసిన కార్పొరేషన్‌ను లూటీ చేశారని తెలిపారు. తాము అధికార దాహం కోసం పాదయాత్ర చేయడం లేదన్నారు. ప్రభుత్వ సొమ్మును లూటీ చేసినవారికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నామని స్పష్టం చేశారు. 14 నెలల్లో విద్యుత్, పాల ధరలు పెంచారని అన్నారు. రైతుల పేరిట మొసలికన్నీరు కారుస్తున్నారని మండిపడ్డారు. పాడిరైతులకు రూ.1200 కోట్లు ఇవ్వాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ప్రతిపక్షనేత అశోక్, జేడీఎస్ యువ విభాగం అధ్యక్షుడు నిఖిల్, మాజీ డీసీఎం అశ్వత్థనారాయణ, ఇంద్రేశ్‌కుమార్, జేడీఎస్ పక్షనేత సురేశ్‌బాబు, సీటీ రవి తోపాటు పలువురు పాల్గొన్నారు.



పాదయాత్రలో బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర తదితరులు



మద్దూరు ర్యాలీలో గజమాలతో స్వాగతం ఇలా...

యూటర్న్‌లపై కుమార వివరణ ఇవ్వాలి

- ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్

బెంగళూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రి కుమారస్వామి గతంలో ఎన్ని విషయాలపై మాట్లాడారో ఎన్ని సందర్భాల్లో యూటర్న్ తీసుకున్నారో వాటన్నింటికీ వివరణ ఇవ్వాలని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ డిమాండ్ చేశారు. మండ్య మై షుగర్స్ మైదానంలో మంగళవారం జనాందోళన సభ నిర్వహించారు. అంతకుముందు మండ్యలో బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీకే శివకుమార్ మాట్లాడుతూ గతంలో కుమారస్వామి, యడియూరప్ప, అశ్వత్థనారాయణ, యోగేశ్వర్ పరస్పరం ఆరోపణలు చేసుకున్నారని గుర్తు చేశారు. వాటికి సంబంధించిన వీడియోలను ప్రదర్శించారు. మండ్య ప్రజలు కల్లబొల్లి మాటలను నమ్మరని తెలిపారు. యూటర్న్ కుమారస్వామి ఎప్పుడూ రంగులు మారుస్తుంటారని అన్నారు. ప్రధాని నరేంద్రమోదీని కలసి ఐదు నిమిషాల్లో మేకెదాటుకు అనుమతులు సాధిస్తానని ప్రకటించారని, నెలలు గడుస్తున్నా దాని ఊసే లేదన్నారు. కావేరి నీటి విషయమై అఖిలపక్ష భేటీ ఏర్పాటు చేస్తే ద్రాక్ష, గోడంబి తినేందుకు వెళ్లాలా అని ఎద్దేవా చేశారని అన్నారు. కానీ అదేరోజు పాండవపురలో మాంసాహార విందు ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. తమిళనాడుకు 148 టీఎంసీలు విడుదల చేశామని, అందులో 64 టీఎంసీలు సముద్రానికి వెళ్లిందన్నారు. మేకెదాటు నిర్మించి ఉంటే ప్రయోజనం కలిగి ఉండేదన్నారు. మంత్రులు రామలింగారెడ్డి, చలువరాయస్వామి, మునియప్ప, సంతోష్‌లాడ్, ప్రియాంక ఖర్గే, బోసరాజు, లక్ష్మీ హెబ్బాళ్కర్, కృష్ణబైరేగౌడ, శరణ ప్రకాశ్‌పాటిల్‌లతోపాటు ఎమ్మెల్యేలు ముఖ్యనాయకులు పాల్గొన్నారు.



మద్దూరులో ప్రసంగిస్తున్న ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్



గవర్నర్‌తో చీఫ్ సెక్రటరీ భేటీ

బెంగళూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్‌ను ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాలిని రజనీశ్ భేటీ అయ్యారు. రాజ్‌భవన్‌లో మంగళవారం సాయంత్రం గవర్నర్‌ను ఆమె కలిశారు. చీఫ్ సెక్రటరీగా శాలిని రజనీశ్ జూలై 31న బాధ్యతలు చేపట్టారు. గవర్నర్ అందుబాటులో లేకపోవడంతో రాజ్‌భవన్‌కు చీఫ్ సెక్రటరీ వెళ్లలేదు. సోమవారం గవర్నర్ బెంగళూరుకు చేరుకున్నారు. గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. గవర్నర్ కొత్త చీఫ్ సెక్రటరీకి శుభాకాంక్షలు తెలిపారు.

గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందచేస్తున్న చీఫ్ సెక్రటరీ శాలిని రజనీశ్

రిటైర్మెంట్‌కు నేను ప్రభుత్వ ఉద్యోగి కాదు

- సిరిగెరె స్వామిజీ

బెంగళూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తాను ప్రభుత్వ ఉద్యోగిని కాదని, ప్రభుత్వం తనను నియమించలేదని, 60 ఏళ్లకు రిటైర్మెంట్ ప్రకటించే నియమావళి లేదని సిరిగెరెలోని తరళబాళు జగద్గురు బృహన్మఠ మఠాధిపతి శివమూర్తి శివాచార్యస్వామిజీ తెలిపారు. చిత్రదుర్గ జిల్లా సిరిగెరెలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో స్వామిజీ మాట్లాడుతూ రిసార్టులో జరిగిన సభకు తాను ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. ఈనెల 18న పాదయాత్రలో తాను ఎవరినీ వ్యక్తిగతంగా కలవడం లేదన్నారు. పెద్దగురువు శివకుమారస్వామిజీ ముందు కొండంత సమస్యలు ఉండేవని, వ్యక్తిగత కారణాలతో 60ఏళ్లకే పీఠాన్ని త్యాగం చేశారని తెలిపారు. తన ముందు ఎలాంటి సమస్యలు లేవన్నారు. 1923లో ఏర్పాటైన నియమావళి సాధు సద్ధర్మ వీరశైవ సంఘం బై-లా అని, అది మఠం బై-లా కాదన్నారు. 1977లో పెద్ద గురువు బైలాను అవసరమైన మార్పులు చేర్పులు చేశారన్నారు. దాని ప్రకారం పీఠాధిపతి మార్పు అంశంలో కన్నడ దినపత్రికల్లో ప్రకటనలు ఇవ్వాల్సి ఉంటుందని, ఇంటర్వ్యూలు చేయాలని ప్రస్తావించారన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇది సాధ్యమా..? అలా చేస్తే ఎవరైనా దరఖాస్తు చేసుకుంటారన్నారు. కాగా మఠం కార్యకలాపాల్లో లావాదేవీలకు సంబంధించి పన్ను రాయితీకోసం 1990లో డీడ్ చేశారని, దీన్ని పాలకమండలి ఆమోదించిందన్నారు. అయితే దీన్ని ఎవరూ ప్రశ్నించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.



శివమూర్తి శివాచార్య స్వామిజీ

కుడితిని బంద్ విజయవంతం

- రైతుల భూములు వెనక్కి ఇవ్వాలని డిమాండ్
- మద్దతు పలికిన రైతు, ప్రజాసంఘాలు

కంప్లి, ఆగస్టు 6: పరిశ్రమల పేరుతో తీసుకున్న తమ భూములను వాపసులు ఇవ్వాలని లేదంటే అక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉద్యోగాలన్నా ఇవ్వాలన్న డిమాండ్‌తో మంగళవారం తలపెట్టిన కుడితి పట్టణ బంద్ విజయవంతమయింది. సీఐటీయు, కర్ణాటక రక్షణ వేదిక, కర్ణాటక ప్రాంత రైతు సంఘం, మహిళా సంఘాలు, రైతన్నల ఆధ్వర్యంలో కుడితిని పూర్తిగా బంద్ చేపట్టారు. బంద్ కారణంగా కుడితిని పట్టణంలో అన్ని వ్యాపారాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా కేపీఆర్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యు. బసవరాజు, జిల్లా అధ్యక్షుడు సత్తిబాబు, జంగ్లిసాబ్, తిప్పేస్వామి మాట్లాడుతూ 500 రోజులుకు పైగా కుడితిని పట్టణంలో హరిగిణ దోణి, జానెకుంటి, యర్రంగళి, సిద్దమ్మనహళ్లి, వేణి వీరాపురం రైతన్నలు లక్ష్మీ మిట్టాల్, ఎస్‌ఎండీసీ, బ్రాహ్మణి కర్మాగారాలకు భూములు పోగొట్టుకుని రోడ్డున పడ్డారని తెలిపారు. అటు భూములు కోల్పోయి, ఇటు ఉద్యోగాలు లేక రైతులకు ఏవిధంగానూ న్యాయం జరుగలేదన్నారు. అందుకు గాను తాము కుడితిని బంద్‌కు పిలుపునిచ్చామన్నారు. ముఖ్యమంత్రి తమతో బెల్గామ్‌లో జరిగిన సమావేశంలో రైతన్నలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని, కమిటీ కూడా ఏర్పాటు చేశారని తెలిపారు. కానీ ఇంతవరకు న్యాయం జరుగలేదని, ఇదిగో అదిగో అంటూ మాటలకే పరిమితమయ్యారని అన్నారు. రైతులపై ఇలాగే నిర్లక్ష్యం వహిస్తే మున్ముందు జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిరసనలు చేపడతామని హెచ్చరించారు. పట్టణ ప్రముఖుడు వి.రాజశేఖర్ మాట్లాడుతూ 2011లో బీజేపీ ప్రభుత్వ హయాంలో పూర్తిగా రైతులకు అన్యాయం జరిగిందన్నారు. అప్పట్లో బ్రాహ్మణీ, లక్ష్మీ మిట్టాల్, ఎస్‌ఎండీసీ కర్మాగారాలకు అధికారుల ద్వారా రైతుల వద్ద వున్న 13 వేల ఎకరాలను తక్కువ ధరలకు కొనుగోలు చేశారని అన్నారు. దీనిపై రైతులు నిరసనలు చేపడుతున్నారన్నారు. రైతులను పట్టించుకోని నాయకులు ముఖ్యమంత్రి స్థలాల విషయంలో పాదయాత్రలు చేపడుతున్నారని విమర్శించారు. రైతుల సమస్యలపై పాదయాత్ర చేయాలని డిమాండ్ చేశారు. ఎలాంటి సంఘటనలు జరుగకుండా డీఎస్పీ పోలీసు బందోబస్తు చేపట్టారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు కనకప్ప, రంగరాజు, ధర్మన్న, గోపాల్, తిమ్మప్ప, సంపత్, నళిని, లోకేష్ పాల్గొన్నారు.



కుడితినిలో ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు



బంద్‌తో నిర్మానుష్యంగా కుడితిని పట్టణం



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1632.14	1,627.56
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	84,696	11,200
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	55,227	5,941
సామర్థ్యం (టీఎంసీలు)	102.34	85.18

తుంగభద్ర నదిలో జారి పడి రైతు మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సిరుగుప్ప, ఆగస్టు 6 : సిరుగుప్ప తాలుకా బృందావన్ క్యాంపు వద్దగల పంపుసెట్టు మోటారు ఆన్ చేస్తుండగా, వీరనాగప్ప (50) అనే రైతు కాలుజారి నదిలో పడి కొట్టుకుపోవడంతో మృత్యుఒడికి చేరాడు. కుటుంబ సభ్యులు సమాచారాన్ని పోలీసులకు తెలియజేయడంతో సంఘటనా స్థలాన్ని తహసీల్దార్ విశ్వనాథ్ సందర్శించారు. సిరుగుప్ప పట్టణ ఎస్‌ఐ పరశురామ్ కేసు నమోదు చేసుకున్నారు.

అక్రమ వ్యవహారాలతో వినాశనమే



మొక్కలకు నీరు పోస్తున్న జడ్జి హుస్సేన్‌సాబ్

సిరుగుప్ప, ఆగస్టు 6: అక్రమ వ్యవహారాల వలన జీవితం నాశనమవుతుందిని, వాటికి మద్దతు పలకడం సరైందికాదని సిరుగుప్ప తాలుకా సివిల్ న్యాయాధికారి హుస్సేన్‌సాబ్ అన్నారు. మంగళవారం సిరుగుప్ప పట్టణం కోర్టు ఆవరణలో అక్రమ వ్యవహారాల వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆయన మొక్కలకు నీరు పోయడం ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనిషి అక్రమ వ్యవహారాలకు పాల్పడరాదని, మంచి నడవడికను ఎంచుకోవాలని సూచించారు. సన్మార్గంలో వెళ్లాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు వెంకోబ, తహసీల్దార్ విశ్వనాథ్, ఎంపీపీ శారద, న్యాయవాదులు అబ్దుల్‌సాబ్, మల్లిగౌడ, గంగారాంసింగ్ తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రకు బయలుదేరిన బళ్లారి రైతులు



మైసూరుకు బయలుదేరిన బళ్లారి రైతులు

బళ్లారిరూరల్, ఆగస్టు 6: కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా బీజేపీ చేపట్టిన పాదయాత్ర విజయవంతం చేసేందుకు సందర్భంగా బళ్లారి జిల్లా రైతు మోర్ఛ సంఘం జిల్లా అధ్యక్షులు ఘనపాల ఐనాథ్‌రెడ్డి నేతృత్వంలో పలువురు బస్సులో బయలుదేరారు. అంతకుముందు బళ్లారి కనకదుర్గమ్మ దేవస్థానంలో రైతు మోర్చా సభ్యులు బళ్లారి కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి, భైరదేవనహళ్లి వన్నారెడ్డి, రైతు మోర్ఛ జిల్లా ఉపాధ్యక్షులు శివరుద్ర గౌడు, స్వరాజ్ పార్టీ గ్రామీణ అధ్యక్షులు రంగారెడ్డి, వెంకటేష్ రెడ్డి, దమ్మూరు పంచాయతీ మాజీ అధ్యక్షులు ప్రకాష్ రెడ్డి, దాసిరెడ్డి, రామనగౌడ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ రైల్వే వంతెన విస్తరించాలి

బళ్లారి సిటీ, ఆగస్టు 6: నగరంలోని కనకదుర్గమ్మ దేవస్థానం దగ్గర ఉన్న రైల్వే వంతెనను విస్తరించాలని యువసేన సోషియల్ యాక్షన్ క్లబ్ అధ్యక్షులు మేకల ఈశ్వరరెడ్డి అదనపు జిల్లా కలెక్టర్‌కు మంగళవారం వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా మేకల ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ బుడా నుండి నిధులను సీనియర్ డివిజన్ ఫైనాన్స్ మేనేజర్ హుబ్బళ్లి వారికి జమచేశారన్నారు. డి.డి ఇచ్చి ఇప్పటికి సుమారు 21నెలలు గడిచినా ఇంత వరకూ పని ప్రారంభం కాలేదని, అధికారులను అడిగితే టెండర్లను పిలిచామన్నారు. రైల్వే వంతెన పనులలో ఎందుకు ఆలస్యం జరుగుతుందని ప్రశ్నించారు. ఈవిషయంపై రాజకీయనాయకులు రైల్వే శాఖ అధికారులతో చర్చించి వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. ఈసందర్భంగా కృష్ణ, బాషా, శ్రీనివాసరెడ్డి, జగన్నాథ, నారాయణ, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



● తుంగభద్ర రిజర్వాయర్ బ్యాక్ వాటర్ సందర్శనకు వందలాది మంది పర్యాటకుల రాక

సందర్శకుల స్వర్గం గుండా ఫారెస్ట్

బళ్లారి సిటీ, ఆగస్టు 6:

హొస్పేట్ నుంచి కేవలం నాలుదు కిలోమీటర్ల దూరంలో ఉన్న గుండా ఫారెస్ట్ అందాలు ఎంత చూసినా తనివి తీరడంలేదు. అక్కడ ఎక్కడ చూసినా పచ్చదనం, పక్షులే. ఓ పక్క నీరు, మరో పక్కన పచ్చని చెట్లు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. టీబీ ప్రాంత వాసులకు అదొక స్వర్గంగా మారిందంటే అతిశయోక్తి కాదు. ఆ ప్రాంతం ఇప్పుడు సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్‌గా మారింది. సెలవురోజు వచ్చిందంటే ఆ అటవీ ప్రాంతంలో ఇసుకవేస్తేరాలదు. జనం అంతగా క్యూకడుతున్నారు. ముఖ్యంగా పిల్లలకు ఇదొక భూలోక స్వర్గమే. విజయనగరం జిల్లా మరియమ్మనహళ్ళి రహదారిలో ఉండే ఈ ప్రాంతంలో తుంగభద్ర జలాశయం బ్యాక్ వాటర్ పొంగిపొర్లుతోంది. తుంగభద్ర బ్యాక్ వాటర్ గుండా ఫారెస్ట్ లోపలికి నీటి ఫౌంటెన్ లాగా పర్యాటకులపైకి దూసుకు వస్తోంది. ఈ నీటిని చూడటానికి వచ్చే చిన్నారుల ఆనందానికి అవధుల్లేవు ఈఏడాది జలాశయం నిండడంతో పర్యాటకులు పెద్ద సంఖ్యలో ఇక్కడకు వస్తున్నారు. అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఈ పార్కులో ఓ ఆక్వేరియం కూడా ఉంది. ప్రస్తుతానికి మూసివేసిన దీనిని మరింత మంది పర్యాటకులను ఆకర్షించేందుకు త్వరలో తిరిగి ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఆక్వేరియంలో అందమైన చేపలు చూడటానికి ఆహ్లాదకరమైన వాతావరణం ఉందని, కనుక ఆక్వేరియంను తిరిగి ప్రారంభించబోతున్నామని మండల అటవీ సంరక్షణ అధికారి భరత్‌రాజ్ తెలిపారు.

పదులసంఖ్యలో వాహనాలకు పార్కింగ్ సౌకర్యం ఉన్నప్పటికీ వారాంతాల్లో మాత్రం హైవే పక్కన క్యూలో నిల్చోవాల్సిన పరిస్థితి నెలకొంది. సాధారణ రోజుల్లోకూడా హైవే పక్కన వాహనాలను పార్క్ చేసి అందాలను అస్వాదించే వారి సంఖ్య ఎక్కువగానే ఉంటుంది. వీరిని అదుపు చేసేందుకు పోలీసు సిబ్బంది, హోంగార్డులు ఉన్నారు. గుండా ఫారెస్ట్‌కు సాధారణ రోజుల్లో 100 మందికిపైగా వస్తుంటారు. వారాంతాల్లో ఈ సంఖ్య 500 దాటుతుంది. రాబోయేరోజుల్లో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రవేశ రుసుము పెద్దలకు రూ 20, పిల్లలకు రూ.10 వసూలు చేస్తున్నారు.

రూ.16 లక్షల బంగారు ఆభరణాల స్వాధీనం



స్వాధీనం చేసుకున్నఅభరణాలతో పోలీసులు

బళ్లారి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): బళ్లారి నగరం కరిమారెమ్మ పాఠశాల సమీపంలో ఉండే 6 ఇళ్లలో చోరీ చేసిన బంగారు అభరణాలను కౌల్‌బజార్ పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. డీఎస్పీ చంద్రకాంత రెడ్డి, పీసీఐ టి. సుభాష చంద్ర నేతృత్వంలో ఆభరణాల రికవరీ జరిగింది. బళ్లారి నగరంలోని హనుమంతప్ప అనే నిందితుడిని కౌల్‌బజార్ పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారించగా ఆరు ఇళ్లలో చోరీకి పాల్పడినట్లు అంగీకరించారు. అతని నుంచి సుమారు రూ. 16,14,000 పైచిలుకు విలువచేసే బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పోలీసులు సోమయ్య, లారెన్స్, నాగరాజు, అన్వర్‌బాష, సోమప్ప, రామన్నగౌడ, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

16న జనస్పందన కార్యక్రమం

బళ్లారి సిటీ, ఆగస్టు 6: ఆగస్టు 16వతేదీ ఉదయం జిల్లా నూతన పాలనా భవనంలో మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి, బళ్లారి జిల్లా ఇన్‌చార్జిమంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్ అధ్యక్షతన జనస్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలు తమ ఫిర్యాదులను అందజేయవచ్చని ఆయన తెలిపారు.

కంప్లి వంతెనపై రాకపోకలు పునఃప్రారంభం



కంప్లి వంతెనను పరిశీలిస్తున్నఅధికారులు



వంతెనపై కాలినడకన వెళుతున్న ప్రయాణికులు

కంప్లి, ఆగస్టు 6 : కంప్లి తుంగభద్ర వంతెనపై ఎట్టకేలకు అధికారులు పాదచారుల రాకపోకలను అనుమతించారు. దీంతో కంప్లి, గంగావతి ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. సుమారుగా నెల రోజుల తర్వాత నదిలో నీటి మట్టం తగ్గడంతో అధికారులు వంతెనపై ప్రయాణానికి అనుమతించారు. ఈ ఉదయం పీడబ్ల్యూడీ అధికారి విశ్వనాథ్ వంతెనను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతానికి వంతెనపై కాలినడకన వెళ్లడానికి మాత్రమే అనుమతి ఇచ్చామన్నారు. ద్విచక్రవాహనాలకు, చిన్నపాటి వాహనాల ప్రయాణానికి మాత్రం పూర్తిగా పరిశీలన అనంతరమే అనుమతి ఇస్తామన్నారు. ఎట్టకేలకు అనుమతులు రావడంతో కంప్లివాసులు మంగళవారం ఉదయం నుంచే కాలినడకన ప్రయాణాలను ప్రారంభించారు.

హంపీ విరూపాక్షేశ్వరుడికి శ్రావణ పూజలు

బళ్లారి సిటీ, ఆగస్టు 6: దక్షిణకాశీగా ప్రసిద్ది చెందిన హంపితోపాటు విజయనగరం జిల్లాలోని ప్రముఖ ఆలయాల్లో శ్రావణ మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. హంపి విద్యారణ్యభారతి స్వామి విరూపాక్షేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. పంపాంబికదేవి, యంత్రోద్ధారక ఆంజనేయ, చక్రతీర్థ కోదండరామ స్వామి, ఉద్దాన వీరభద్రుడు, మాల్యవంత రఘునాథ ఆలయాల్లో కూడా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. హొస్పేట్ తాలూకా బుక్కసాగర్, కమలపురం గారేబావి అంజనేయ, నాగేశ్వర్, జంబునాథేశ్వర, హోసూరమ్మదేవి, వడకరాయ రంగనాథస్వామి, కనవీరయ్య, ఊరమ్మదేవి, నీలకంఠేశ్వర్, సానక్కి వీరభద్రేశ్వర్, రామలింగేశ్వరుడు తదితర ఆలయాలను భక్తులు దర్శించుకున్నారు. హగరిబొమ్మనహళ్ళి తాలూకాలోని తాంద్రహళ్ళి బండే రంగనాథస్వామి, కొట్టూరు తాలూకాలోని కొట్టేశ్వర, హువినహడగలి తాలూకాలోని మైలారనింగేశ్వర్, కొమరనహళ్ళి తాండ కొండలోని మల్లయ్య, కురువట్టి బసవేశ్వర్, హరపనహళ్ళితాలూకా అరిసికేరి ఉచ్చంగి దుర్గాదేవి సన్నిధిలో ప్రత్యేక పూజలు, జరుగుతున్నాయి. భక్తులు శ్రావణ మాసంలో సోమవారం ఒకేరోజున విరూపాక్షాలయ నాలుగు ద్వారాలను, చివరకు మధ్యలో కొలువైన ఈశ్వరుని దర్శనం చేసుకుంటే కోరుకున్న కోరికలు నెరవేరుతాయని పురాణాలు చెబుతున్నాయి. శ్రావణ మాసం సందర్భంగా భక్తులు పంచలింగాలను దర్శించుకుంటే మంచి జరుగుతుందని హొస్పేట్ ఎమ్మెల్యే గవియప్ప అన్నారు.



విరూపాక్షేశ్వరునికి అభిషేకం చేస్తున్న విద్యారణ్యభారతి స్వామి

విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన

బళ్లారి సిటీ, ఆగస్టు 6: పిల్లలకు చదువుతో పాటు ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని, జిల్లాపంచాయితీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప అన్నారు. బళ్లారి తాలూకా కొళగల్లు గ్రామంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన ఆరోగ్యకర నీటి పారుదల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. 713పాఠశాలల్లో 7నుండి 10వ తరగతి చదువుతున్న ప్రభుత్వ ఎయిడెడ్. నాన్‌ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులందరికీ ఆరోగ్య అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించామని ఆయన తెలియజేశారు. జిల్లాలోని అన్ని తాలూకాలు నేటి తరం ఆరోగ్యంగా ఉండాలంటే పాఠశాల విద్యార్థులకు ఆరోగ్యంపై మరింత అవగాహన కల్పించాలన్నారు. ఈవిషయాన్ని ఇరుగుపొరుగు వారికి కూడా తెలియజేయాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్ రమేశ్‌బాబు మాట్లాడుతూ చిన్నారులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు డెంగ్యూ క్షయ కుష్టువ్యాధి, బాల్యవిహాలు ,రుతుక్రమ నిర్వహణ చేతులు కడుక్కోవడం, వ్యర్థ పదార్థాల నిర్వహణపై అవగాహన కల్పించాలన్నారు. మహిళా శిశు అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ.. బాల్య వివాహాల వల్ల కలిగే ప్రాణాంతక సమస్యలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని బాల్యవివాహాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే 1098కి ఫోన్ చేయవచ్చునన్నారు.



మాట్లాడుతున్న జిల్లాపంచాయతీ సీఈఓ రాహుల్ శరణప్ప

సాగునీటి కాలువకు చరండీ కాలువ లింక్



సాగునీటి కాలువకు లింక్ కోసం నిర్మాణం అవుతున్న చరండీ కాలువ

బళ్లారి గాంధీనగర్, ఆగస్టు 6: మోకా రోడ్డులోని హెచ్చెల్సీ ఉప కాలువ ఆయకట్టు రైతులకు నీరు అందించేందుకు ఏర్పాటు చేసిన కాలువకు చరండీ నీటి కాలువలను లింక్ చేయడం పట్ల స్థానిక రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పొలాలకు నీరు సరిగా అందని ఈ తరుణంలో ప్రజా పనుల శాఖ అధికారులు సాగునీటి కాలువలకు చరండీ నీటి కాలువను లింక్ చేయడం ఏమిటని రైతులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. స్థానిక నీటి పారుదల శాఖ అధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్ళినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ప్రజా పనుల శాఖ అధికారుల వివరణ కోరితే.. ప్రస్తుతం నిర్మిస్తున్న కాలువను వర్షపు నీరు వెళ్లడానికి ఏర్పాటు చేస్తున్నట్లు కంటితుడుపు మాటలు వినిపిస్తున్నారు. నగరంలోని ప్రధాన రోడ్లలో ఏర్పడిన గుంతలు పూడ్చలేని అధికారులు బాగున్న రోడ్లపై డ్రైనేజి కాలువ నిర్మాణాలు నిర్మించి నగర సుందరీకరణ పేరిట కళ్యాణ కర్ణాటక బోర్డు నిధులు వృథా చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కళ్యాణ కర్ణాటక బోర్డు అధికారులు నిధులు వృథాకాకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రైవేటీకరణకు నిరసనగా సంతకాల సేకరణ



బళ్లారి రైల్వే స్టేషన్ వద్ద సంతకాలు సేకరిస్తున్న దృశ్యం

బళ్లారి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రైల్వే శాఖ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ బళ్లారిలో మంగళవారం సంతకాల సేకరణ జరిగింది. రైల్వే ప్రయాణికుల సంఘం నాయకులు ఏఐడీఎస్‌వో సంఘాల నేతృత్వంలో దీనిని ప్రారంభించారు. రైల్వేలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని, జనరల్, స్లీపర్, కోచ్‌లను పెంచాలని, రైల్వేను ప్రైవేటీకరణ చేయరాదనే డిమాండ్లతో ఈ సంతకాల సేకరణ కార్యక్రమం చేస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబరు 12 వరకూ ఈ సంతకాల సేకరణ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏ. పంపాపతి కోలూరు, జిల్లా కార్యదర్శి జగదీష్ నింగ్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ అంబేడ్కర్ భవనాన్ని పూర్తి చేయండి

తోరణగల్లు, ఆగస్టు 6: దళిత యువకుల సంఘం, డీవైఎఫ్ఐ సంఘం ఆధ్వర్యంలో మనవి తోరణగల్లు గ్రామంలోని డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ భవన నిర్మాణం పూర్తి కాలేదని, వెంటనే పూర్తి చేయాలని దళిత యువకుల సంఘం, డీవైఎఫ్ఐ పద్మావతి సంఘం, డీవైఎఫ్ఐ తాలుకా అధ్యక్షులు షరీఫ్, కార్యదర్శి నాగభూషణం డిమాండ్ చేశారు. దీనిపై సంబంధిత ప్రభుత్వ అధికారులకు వినతి పత్రం చాలాసార్లు ఇవ్వడం జరిగిందని కానీ ఇంతవరకు భవన నిర్మాణం పూర్తికాలేదని కట్టడ నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు. అలా కానిపక్షంలో ముందు ధర్నా, పోరాటాలు చేస్తామన్నారు. ఈ సందర్భంగా డీఎస్ఎస్ అధ్యక్షుడైన బాబు దొడ్డ బసవ గ్రామ పంచాయతీ సభ్యుడు హనుమంతు, డీవైఎఫ్ఐ అధ్యక్షులు కార్యదర్శి నాగభూషణం, స్వామి తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

వైభవంగా కాళీ కాముండేశ్వరి ఆలయ వార్షికోత్సవం



ఊరేగింపుగా వెళుతున్న అమ్మవారి భక్తులు

హోసూరు, ఆగస్టు 6 : హోసూరు సమీపంలోని టీవీఎస్ రోడ్డులోని నంజాపురం గ్రామంలో కాళీ కాముండేశ్వరీ ఆలయంలో శుక్రవారం 14వ వార్షికోత్సవాన్ని ప్రారంభించారు. ధ్వజారోహణం ఘనంగా జరిగింది. ఆ సమయంలో ఆలయంలో గణపతి హోమం, పాల బిందెలతో కుంభాభిషేకం, అమ్మవారికి గంగాపూజ, అలంకరణలు, సుమంగళీ పూజలు, దీపారాధనలు, జరిగాయి. చివరి రోజైన మంగళవారం ఉదయం 9 గంటలకు మునీశ్వరస్వామికి పూజలు చేసి వీధుల గుండా అమ్మవారిని వేషభూషణలతో అలంకరించి ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా ఏర్పాటు చేశారు.

తమిళనాడు ప్రభుత్వ పథకాల ప్రదర్శన

హోసూరు(కృష్ణగిరి), ఆగస్టు 6 : కృష్ణగిరి జిల్లాలో అన్ని శాఖల ద్వారా అమలు చేస్తున్న వివిధ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రజాసంబంధాల శాఖ ఆధ్వర్యంలో మద్దూరు పంచాయతీ ఇచ్చంకాడు గ్రామంలో ఫోటో ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ ఎగ్జిబిషన్‌లో తమిళనాడు ప్రభుత్వం తరఫున మహిళలకు పథకాలు, ముఖ్యమంత్రి అల్పాహార పథకం, కొండ గ్రామాలకు అందించిన 109 అంబులెన్స్ సేవలు వంటి అనేక ప్రత్యేక ప్రాజెక్టుల గురించి వివరించారు. కృష్ణగిరి జిల్లాలో రైతులకు సబ్సీడీ వ్యవసాయ పనిముట్లు, విద్యుత్ కనెక్షన్ పథకం, వికలాంగుల సంక్షేమ సహాయం, పాఠశాలకు ఇంద్రధనుస్సు పథకం విద్యార్థులకు ఉచిత సైకిళ్లు అందజేసే పథకాల గురించి కూడా వివరించారు. జిల్లా కల్యాణోత్సవాల ఫోటోలను ప్రదర్శించారు. ప్రదర్శనకు 300 మందికిపైగా హాజరయ్యారు.

అనప దిగుబడి అదుర్స్

హోసూరు, ఆగస్టు 6: హోసూరు ప్రాంతంలో గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు దిగుబడి పెరగడంతో అనపకాయలను కిలో రూ.50 నుంచి 60 కు విక్రయిస్తున్నారు. మార్కెట్‌ల్లో 50 కిలోల మూట రూ.2000 నుంచి రూ.2.500 వరకు విక్రయిస్తున్నారు. గత రెండు నెలలుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో వర్షాలపై ఆధారపడిన రైతులు వరి, మొక్కజొన్న, మినుము, వేరుశెనగ, తదితర పంటలను సాగు చేస్తున్నారు. ముఖ్యంగా ఇక్కడ పండించే కూరగాయలను చెన్నై సహా పెద్ద నగరాలకు, కేరళ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక వంటి రాష్ట్రాలకు ట్రక్కుల ద్వారా పంపిస్తున్నారు.ఇక్కడి పంటలు చూసేందుకు ఆహ్లాదకరంగా ఉన్నాయి.



పచ్చదనంతో అనపకాయలు, పూలు

వైద్య సేవలకు దూరంగా ఆయుష్మాన్ కేంద్రం

బళ్లారి గాంధీనగర్, ఆగస్టు 6: గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఆరోగ్యం అందనంత దూరంగా ఉందని చెప్పవచ్చు. బళ్లారి తాలూకా పరిధి రూపనగుడి గ్రామంలో రూ.52లక్షల నిధులతో నిర్మించిన ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం వలన ఆరోగ్యసేవలు అందడం లేదు. బళ్లారి తాలూకాలోని రూపనగుడి ఆరోగ్య కేంద్రం అనంతపురం జిల్లా సరిహద్దు ప్రాంతం కావడంతో చుట్టుప్రక్కల ప్రజలకు ఇది ఆరోగ్య వరదాయినిగా ఉండాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం లక్షలాది రూపాయలతో ఈ కేంద్రాన్ని నిర్మించింది. కాని ఇక్కడ సరైన సదుపాయలు అందడం లేదు. 24గంటలు ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన డాక్టర్లు ఆరోగ్య కేంద్రానికి అడపాదడపా వచ్చి వెళుతుండడంతో డాక్టర్ల కోసం రోగులు ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం విస్తరిస్తున్న డెంగీ వ్యాధితో ఒకవైపు గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ఆరోగ్య శాఖ అధికారులు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారే గాని... ఆసుపత్రిచుట్టు ప్రక్కల పరిసరాలను శుభ్రంగా ఉంచాలనే విషయాన్ని ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యం చేస్తున్నారు.



అపరిశుభ్రంగా ఉన్న ఆసుపత్రి పరిసరాలు



వైద్యుల కోసం ఎదురు చూస్తున్న వృద్ధురాలు

గర్భగుడిలో దర్శన్ చిత్రపటానికి పూజలు.. పూజారిపై వేటు

కంప్లి, ఆగస్టు 6: సినీరంగంలో పేరుగాంచిన దర్శన్ అభిమానులు కొందరు కురుగోడు దొడ్డ బసవేశ్వరాలయంలో ఆయన చిత్రపటాలకు పూజలు చేశారు. ఇలా గర్భగుడిలో జైలుకు వెళ్లిన వ్యక్తులకు పూజలు చేయడంపై కొందరు అభ్యంతరం చేశారు. ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో వెంటనే అధికారులు దీనిని అనుమతించిన అర్చకుడిని సస్పెండ్ చేశారు.




దర్శన్ చిత్రపటానికి పూజలు చేసిన దృశ్యం

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

డాక్టర్ ఎం కరుణానిధి (వర్ధంతి)



తమిళనాడులో సుమారు రెండు దశాబ్దాలపాటు ముఖ్యమంత్రిగా కొనసాగి తనదైన చరిత్రను లిఖించిన ముత్తువేల్ కరుణానిధి 1924 జూన్ 3న మద్రాస్ ప్రాంతం తిరుకువలైలో జన్మించారు. వెండితెరపై నటుడిగా సత్తా చాటి కలైజ్ఞర్‌గా పేరొందారు. సాహితీవేత్తగా ఎన్నో రచనలు చేశారు. నటుడిగా, రచయితగా, రాజకీయనేతగా, డీఎంకే నేతగా బహుముఖ ప్రజ్ఞాశాలి. ద్రవిడ ఉద్యమంలో కీలకంగా సాగి ద్రవిడ మున్నేట్ర కజగం (డీఎంకే) పార్టీకి పది సార్లు అధ్యక్షుడిగా కొనసాగారు. 60 ఏళ్ల రాజకీయ జీవితంలో పోటీచేసిన ప్రతిసారి గెలుపొంది గిన్నిస్ రికార్డు సృష్టించారు. పలు గౌరవాలు అందుకున్నారు. 2018 ఆగస్టు 7న కన్నుమూశారు.

ప్రొఫెసర్ ఎంఎస్ స్వామినాథన్ (జయంతి)



'పద్మవిభూషణ్' గ్రహీత, 'పచ్చ దనం విప్లవ పితామహ'గా పేరొందిన డాక్టర్ స్వామినాథన్ 1925 ఆగస్టు 7న తమిళనాడులోని కుంబకోణంలో జన్మించారు. ఆయన పూర్తి పేరు మాన్‌కొంబు సాంబ శివన్ స్వామినాథన్. జన్యుశాస్త్ర నిపుణుడు, పరిశోధ కులు, రచయిత. ప్రత్యేకించి వరి, గోధుమ పంటల సాగుపై పరిశోధనలు చేసి ఆధునిక వ్యవసాయ పద్ధ తులను ప్రవేశపెట్టారు. 50కుపైగా గౌరవ డాక్టరేట్లు అందుకున్నారు. 2007 నుంచి 2013మధ్య రాజ్యసభ సభ్యుడిగా వ్యవహరించారు. యునెస్కో మహాత్మాగాంధీ గోల్డ్ మెడల్, ఇందిరాగాంధీ అవార్డ్ ఫర్ నేషనల్ ఇంటిగ్రేషన్ తదితర పురస్కారాలు అందుకున్నారు. 2023 సెప్టెంబరు 28న కన్నుమూశారు.

ఒలివర్ హార్డీ (వర్ధంతి)



అమెరికాకు చెందిన ప్రముఖ నటుడు ఒలివర్ నార్వెల్ హార్డీ 1892 జనవరి 18న జన్మించారు. 1927 నుంచి 1955వరకు మూకీ నుంచి టాకీ సినిమాలలో నటించిన ఘనత ఉంది. 1914లో 'అవుట్ విట్టింగ్ డాడ్' ఆయన తొలిసినిమా. 'లారెల్ అండ్ హార్డీ' ద్వయంలో ఒకరు. 107 షార్ట్ ఫిల్మ్స్, ఫీచర్ ఫిల్మ్స్‌లో నటించారు. కమెడియన్‌గా పేరొందారు. 1957 ఆగస్టు 7న కన్నుమూశారు. కాగా లారెల్ అండ్ హార్డీ మ్యూజియం హార్డీ సొంతప్రాంతం జార్జియాలోని హార్లెమ్‌లో ఏర్పాటైంది.

సుత్తివేలు (జయంతి)



వెండితెరపై 'సుత్తివేలు'గా పేరొందిన కురుమద్దాలి లక్ష్మీ నరసింహారావు 1947 ఆగస్టు 7న కృష్ణా జిల్లా మచిలీపట్నం మండలంలో జన్మించారు. నాటకరంగం నుంచి వెండితెరపైన కమెడియన్‌గా, క్యారెక్టర్ నటుడిగా పేరొందారు. తెలుగులో రెండు దశాబ్దాలపాటు 200కు పైగా సినిమాలలో నటించారు. 4 నంది అవార్డులు అందుకున్నారు. జంధ్యాల దర్శకత్వం లోనూ, నటుడు సుత్తి వీరభద్రరావుతోనూ కలసి ఎక్కువ సినిమాలలో నటించారు. బుల్లితెరపై పలు సీరియల్స్‌లో నటించారు. 2012 సెప్టెంబరు 16న కన్నుమూశారు.

దొంగతనాలను ఆపాదించడం సరికాదు

- జ్యువెలరీ షాపుల అసోసియేషన్ ఆగ్రహం
- కర్ణాటక పోలీసులను నిలదీసిన వైనం



పోలీసు స్టేషన్ వద్ద గుమికూడిన జ్యువెలరీ వ్యాపారులు

ధర్మవరం, ఆగస్టు 6: ఎవరో ఎక్కడో చేసిన దొంగతనాన్ని జ్యువెలరీ షాపుల యాజమాన్యాలకు ఆపాదిస్తూ ఇబ్బంది పెట్టడం సరికాదంటూ ధర్మవరం జ్యువెలరీ షాపుల అసోసియేషన్ నాయకులు మండిపడ్డారు. కొందరు దుండగులు కర్ణాటకలో బంగారం దొంగిలించి ధర్మవరంలో అమ్మారన్నారు. దీంతో అనంతపురం పోలీసులు దొంగలిచ్చిన సమాచారం మేరకు 20 రోజుల క్రితం రికవరీ చేసినప్పటికి మళ్లీ కర్ణాటక పోలీసులు వచ్చి బంగారం ఇవ్వాలంటూ షాపు యజమాని షాహీర్‌ను తీసుకెళ్తుడంటంపై అసోసియేషన్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ అడ్డుకున్నారు. దీంతో కర్ణాటక పోలీసులు, జ్యువెలరీషాపుల యజమానులు ధర్మవరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు చేరడంతో ఉద్రిక్తత నెలకొంది. అసోసియేషన్ అధ్యక్షుడు ఖలీల్ రహిమాన్ మాట్లాడుతూ పట్టణంలోని షాహీర్‌అనే స్వర్ణకార వ్యాపారిని స్థానిక పోలీసుల సహకారంతో చిత్రదుర్గ పోలీసులు తీసుకెళ్లడం సరైన పద్ధతి కాదన్నారు. గత నెలలోనే అనంతపురం పోలీసులకు కొనుగోలు చేసిన బంగారాన్ని ఇచ్చేశారన్నారు. మళ్లీ చిత్రదుర్గ పోలీసులు వచ్చి అదే బంగారాన్ని ఇవ్వాలని వ్యాపారిని ఇబ్బంది పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. మీ తప్పులను కప్పి పుచ్చుకోవడానికి బంగారుషాపు దుకాణాలపై అభాండాలు మోపడం పద్ధతికాదన్నారు. షామీర్‌ను వదిలేవరకు సంఘం తరపున చట్టపరంగా పోరాడుతామన్నారు.

భావితరాలకు చరిత్ర తెలియాలి

» కన్నడ జ్యోతి రథయాత్రకు స్వాగతం



కన్నడ జ్యోతి రథాన్ని స్వాగతిస్తున్న కన్నడ అభిమానులు

విజయపుర, ఆగస్టు 6: కర్ణాటక నామకరణం జరిగి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కర్ణాటక సంభ్రమ 50 రథానికి మంగళవారం ఘన స్వాగతం లభించింది. రథం ద్వారా కన్నడ నాడు, నుడి, సంస్కృతిపై అవగాహన కల్పిస్తున్నారని జిల్లా కసాప అధ్యక్షుడు కృష్ణప్ప అభిప్రాయపడ్డారు. దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణంలోని కోలారు మెయిన్ రోడ్డు నుంచి వచ్చిన రథానికి పురసభ, జిల్లా కసాప, పట్టణ కసాప సభ్యులు, కన్నడ అభిమానులు స్వాగతం పలికారు. కృష్ణప్ప మాట్లాడుతూ కన్నడిగులైన మనమంతా ఒకటే అనే సౌహార్ద్ర సందేశం ఇచ్చేలా కన్నడ మాత భువనేశ్వరి భావచిత్రంతో రాష్ట్రమంతా ఇంటింటికి చేరనుందన్నారు. మైసరు రాష్ట్రం కర్ణాటక పేరు మార్పు అయి 50 ఏళ్లు గడ వడంతో భావితరాలకు మన చరిత్రను తెలియచేయడమే లక్ష్యమన్నారు. పురసభ ముఖ్య అధికారి సంతోష్‌కుమార్ మాట్లాడుతూ కన్నడ భాష మనుగడకు శ్రమించిన సాహితీ వేత్తలు, పోరాటనేతలను స్మరించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఈ సందేశం కన్నడ అభిమానులకు చేరాలన్నారు. ఈ తరుణంలో కన్నడ రథయాత్రను మనస్ఫూర్తిగా స్వాగతించడంతోపాటు కన్నడ నాడు నుడి ప్రాధాన్యతను అందరికీ తెలియచేయాలన్నారు. పట్టణ కసాప అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ కన్నడభాషకు రెండువేల సంవత్సరాల చరిత్ర ఉందని, సాంస్కృతికంగా, రాజకీయంగా, విద్యాపరంగా పరంపర కలిగి ఉందన్నారు. దీన్ని భావి తరాలకు పదిలంగా అందించాలన్నారు. పురసభ సభ్యుడు అనీఫ్‌వుల్లా మాట్లాడుతూ కర్ణాటకలో ఉన్న మనమంతా ఒక్కరే అని సోదరభావంతో మెలగాలన్నారు. రాష్ట్రంలో కోట్లాదిమంది మాతృ భాష కన్నడయే అని అలాగే పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, దయ్యూ డామన్‌లలో కన్నడ మాతృ భాష కల్గినవారు ఉన్నారన్నారు. ఈ రథయాత్ర కళాబృందాలతో బూదిగెరె, చన్నరాయపట్టణల మీదుగా వైభవంగా సాగింది. ఈ సందర్భంగా పురసభ మాజీ ఉపాధ్యక్షుడు కేశవప్ప, సభ్యులు రాజణ్ణ, బసవరాజ్, టీచర్ పరమేశ్, కరవే చంద్రశేఖర్, మునిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మధుమేహంపై చైతన్యం కల్పిస్తాం



ఒప్పందంలో మంత్రి దినేశ్‌గుండూరావు, సంస్థ ప్రముఖులు

» వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్‌గుండూరావు

బెంగళూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మధుమేహంపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చే చర్యలు చేపడతామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావు తెలిపారు. 'చేంజింగ్ డయాబెటీస్ బారోమీటర్' కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు నోవోనార్డిస్క్ శిక్షణ ట్రస్టుచే నగరంలో మంగళవారం ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నోవోనార్డిస్క్ ఇండియా సంస్థ లాభాపేక్ష లేకుండా సేవలందిస్తోందన్నారు. రాష్ట్రంలో పెరిగిపోతున్న మధుమేహ బాధితులలో చైతన్యం తీసుకురావడం, సామర్థ్యాన్ని పెంచడం, చికిత్సలు పొందే విధానం, డయాబెటిక్ సమతుల్యత పాటించేలాంటి అంశాలపై అవగాహన కల్పిస్తారన్నారు. నేషనల్ హెల్త్ మిషన్ డైరెక్టర్ నవీన్‌భట్, నోవోనార్డిస్క్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ విక్రాంత్ శ్రోత్రి, ఎండీ జాన్ డాబర్, వైద్యఆరోగ్యశాఖ కార్యదర్శి హర్షగుప్త, కో డైరెక్టర్ రణదీప్‌తోపాటు పలువురు పాల్గొన్నారు. ప్రభుత్వ సహకారంతో మధుమేహ బాధితుల ఆరోగ్య సమతుల్యంపై కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు.

వర్గీకరణపై సుప్రీం తీర్పు హర్షణీయం

బాగేపల్లి, ఆగస్టు 6: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు మహత్తరమైనదని బాగేపల్లి దళిత సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. తాలూకా దళిత సంఘర్ష సమితి, మాదిగ దండోరా, వివిధ సంఘాల సభ్యులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం బాణాసంచా కాల్చి ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం దళిత నేత బీవీ వెంకటరమణ మీడియాతో మాట్లాడారు. సుమారు 30-40 ఏళ్లపాటు కర్ణాటక సహా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలలో సుదీర్ఘ పోరాటానికి సుప్రీంకోర్టు తీర్పుతో మోక్షం లభించినట్టయ్యిందన్నారు. ఎస్సీలో 101 ఉపజాతులు ఉన్నాయని రిజర్వేషన్ వర్గీకరణతో సామాజిక, విద్య, ఆర్థిక, రాజకీయంగా ఎదుగుదలకు వీలు కానుందన్నారు. 1994లో ఆంధ్రప్రదేశ్‌లో మందకృష్ణ మాదిగ పోరాటం చేశారని ఇది ఇతర రాష్ట్రాల్లోనూ కొనసాగిందని గుర్తు చేశారు. సుదీర్ఘ పోరాటానికి కోర్టు తీర్పుతో ప్రతిఫలం దక్కిందన్నారు. కాగా దీన్ని సీఎం సిద్దరామయ్య జాప్యం చేయకుండా వెంటనే అమలు చేయలని డిమాండ్ చేశారు. సమావేశంలో కడ్డీలు వెంకటరమణ, శివప్ప, ఆదినారాయణ, జయంత్, నాగప్ప, గోపి, నరసింహప్ప, సతీశ్, నంజుండప్ప, మంజు ఈరప్ప, కేజీ వెంకటరమణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

కేంద్రం తీరుపై కాంగ్రెస్ నిరసన



నిరసన ర్యాలీలో ఎమ్మెల్యే నారాయణస్వామి తదితరులు

బంగారపేట, ఆగస్టు 6: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరగడంపై కాంగ్రెస్ నిరసన చేపట్టింది. బంగారపేట బ్లాక్, బూదికోటె బ్లాక్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాష్ట్రం పట్ల కేంద్రం సవతితల్లి ధోరణిలో వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ మంగళవారం నిరసన చేపట్టారు. బీజేపీ హయాంలో 21 అక్రమాలపై దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేస్తూ, ప్రస్తుతం బీజేపీ చేపట్టిన పాదయాత్ర నకిలీదంటూ మండిపడ్డారు. కాంగ్రెస్ కార్యాలయం నుంచి బయల్దేరి అంబేడ్కర్ విగ్రహానికి చేరుకుని నంది మెడికల్ కువెంపు సర్కిల్ మీదుగా తాలూకా కార్యాలయానికి చేరుకుని నిరసన నిర్వహించారు. ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి నేతృత్వంలో తహసీల్దార్ వెంకటేశప్పకు వినతిపత్రం అందచేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో 136 స్థానాల మెజారిటీతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిర్వీర్యం చేసేకుట్రతో బీజేపీ, జేడీఎస్‌లు ముఖ్యమంత్రిపై నిరాధార ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. శాసనసభ ఎన్నికల వేళ ఇచ్చిన ఐదు హామీలను అధికారంలోకి వచ్చాక అమలు చేస్తున్నామని ప్రభుత్వానికి లభిస్తున్న ప్రతిష్ఠను ఓర్వలేక ఇలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఒక సాధారణ వ్యక్తి పిటీషన్‌తో గవర్నర్ సైతం వెంటనే స్పందించి నోటీసు ఇవ్వడం వెనుక కుట్ర ఉందని ఆరోపించారు. కేంద్రం చేతిలో గవర్నర్ కీలుబొమ్మగా మారారన్నారు. నిరసనలో కాంగ్రెస్ నాయకులు పార్థసారథి, డీసీసీ బ్యాంకు డైరెక్టర్ గోవిందరాజు, నగరాభివృద్ధి ప్రాధికార అధ్యక్షుడు గోపాలరెడ్డి, బంగారపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపాలగౌడ, బూదికోటె బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు కేవీ నాగరాజ్, పురసభ సభ్యులు షంషుద్దీన్ బాబు, అరుణాచలం మణి, గోవింద, పెద్దసంఖ్యలో కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పాలనాణ్యతలో హొసకోటెకు ప్రథమ స్థానం

హొసకోటె, ఆగస్టు 6: పాల దిగుబడిలో జిల్లాలో హొసకోటె తాలూకా ప్రథమస్థానంలో ఉందని బెంగళూరు పాల సమాఖ్య డైరెక్టర్ హుల్లూరు సి మంజునాథ్ అభిప్రాయపడ్డారు. రానున్న రోజుల్లో మరింత పెరగాలన్నారు. తాలూకాలోని శిడ్లఘట్టరోడ్డులో పాల సమాఖ్య శిబిరం కార్యాలయంలో కర్ణాటక పాల సహకార మహామండలి, బెంగళూరు, బెంగళూరు గ్రామీణ జిల్లా సహకార సమాఖ్య సహకారంతో తాలూకాలోని పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల ముఖ్య కార్యనిర్వాహక అధికారులతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తాలూకాలో పాల ఉత్పత్తిదారుల సహకార సంఘంలో రాజకీయాలకు అవకాశం ఇవ్వరాదన్నారు. పరస్పర సహకారంతో అభివృద్ధి సాధించాలన్నారు. శిబిరం కార్యాలయ డిప్యూటీ మేనేజర్ డాక్టర్ శివాజి నాయక్ మాట్లాడుతూ బీఎంసీలు ఉన్న తాలకాలను మించి హొసకోటె తాలూకా స్థానిక పాలసమాఖ్యలలో నాణ్యతకు పెట్టింది పేరుగా ఉందన్నారు. బెంగళూరు సహకార పాల సమాఖ్య అధ్యక్షుడు ఏసీ నాగరాజ్, అధ్యక్షత వహించగా మేనేజర్ చంద్రప్ప, అభివృద్ధి అధికారి మాధవరెడ్డి, లెక్చరర్ జగదీశ్, పాల ఉత్పత్తిదారుల ఉద్యోగుల క్షేమాభివృద్ధి సంఘం అధ్యక్షుడు విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



డెయిరీ సంఘాల ముఖ్య అధికారుల సమావేశంలో మంజునాథ్ తదితరులు

కుంభిగానహళ్లి పంచాయతీ అధ్యక్షుడిగా నాగరాజ్



నూతన అధ్యక్షుడు నాగరాజ్‌ను అభినందిస్తున్న అనుచరులు, సభ్యులు

శిడ్లఘట్ట, ఆగస్టు 6: శిడ్లఘట్ట తాలూకాలోని జంగమకోటె హోబళి కుంభిగానహళ్ళి గ్రామ పంచాయతీ నూతన అధ్యక్షుడిగా హేమర్లహళ్ళికి చెందిన హెచ్‌పీ నాగరాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇదివరకు ఉన్న అధ్యక్షుడి రాజీనామాతో ఖాళీ అయిన స్థానానికి ఎన్నికలు నిర్వహించగా జేడీఎస్ మద్దతుదారుడు హెచ్‌పీ నాగరాజ్ ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. దీంతో ఏకగ్రీవమైనట్టు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన తహసీల్దార్ బీఎన్ స్వామి ప్రకటించారు. ఈ సందర్భంగా నాగరాజ్‌ను అభిమానులు, సభ్యులు ఆత్మీయంగా సత్కరిం చారు. అనుచరులు మిఠాయిలు పంచిపెట్టారు. నాగరాజ్ మాట్లాడుతూ పంచాయతీ ద్వారా అర్హులైనవారందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చేయడానికి కృషి చేస్తానన్నారు. పంచాయతీ అభివృద్ధికి సభ్యులందరూ సహకరించాలన్నారు. రూరల్ ఎస్సై సతీశ్, గ్రామపంచాయతీ మాజీ అధ్యక్షుడు అమరావతి రాజణ్ణ, సభ్యులు గంబీరనహళ్ళి మంజునాథ్, బుసనహళ్ళి రామకృష్ణప్ప, కాళనాయకనహళ్ళి రామదాస్, సుబ్రమణి తదితరులు పాల్గొన్నారు.

వయనాడ్‌కు 8 లారీలలో నిత్యావసరాలు



బెంగళూరులో వయనాడ్‌కు లారీలకు పచ్చజెండా

బెంగళూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రం వయనాడ్ వరద బాధితులకోసం మంత్రి రామలింగారెడ్డి, ఆయన కుమార్తె సౌమ్యారెడ్డిల నేతృత్వంలో సిద్ధం చేసిన నిత్యావసర వస్తువుల వాహనాలకు డీసీఎం డీకే శివకుమార్ పచ్చజెండా చూపారు. 8 లారీలలో మంగళవారం నిత్యావసరాలను పంపారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. పొరుగు రాష్ట్రంలో ప్రకృతి వైరీత్యంతో బాధపడుతున్న ప్రజలకు తమవంతు చేయూత ఇస్తున్నట్టు డీసీఎం ప్రకటించారు.



లాల్‌బాగ్‌లో వడివడి సాగుతున్న ఏర్పాట్లు

రేపటి నుంచి లాల్‌బాగ్‌లో ఫ్లవర్ షో

బెంగళూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో లాల్‌బాగ్‌లో ఈనెల 8నుంచి 216వ ఫలపుష్ప ప్రదర్శన జరగనుంది. ప్రదర్శనకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయని అధికారులు ప్రకటించారు. ఈసారి భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవనం, సాధనలు తెలిపే నమూనా పార్లమెంటు భవనం ఉంటాయన్నారు. ఈ ఫ్లవర్ షో చూడడానికి అన్ని వర్గాలు ప్రజలు వస్తుంటారు.



అంబేడ్కర్ విగ్రహాలు

వయనాడ్‌లో శ్రమిస్తున్న కలెక్టర్ మేఘశ్రీ

» చిత్రదుర్గ జిల్లాలో హర్షాతిరేకం



కలెక్టర్ డీఆర్ మేఘశ్రీ

బెంగళూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రం వయనాడ్‌లో భూమికుంగిన ఘటనలో స్మశానంగా మిగిలింది. ఊళ్లకు ఊళ్లు కొట్టుకుపోయాయి. ఎంతో మంది దేహాలు గుర్తించలేని స్థితి. గల్లంతైనవారికోసం ఎదురు చూస్తూనే ఉన్నారు. ఇలాంటి తరుణంలో వయనాడ్ జిల్లా కలెక్టర్‌గా వ్యవహరిస్తున్న మేఘశ్రీ కార్యవైఖరిపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తం అవుతున్నాయి. ఇటీవలే ఆమె వయనాడ్ జిల్లా అధికారిగా బదిలీ అయ్యారు. ప్రతిక్షణం ప్రజల కష్టాలకు స్పందిస్తున్నారు. పీడిత ప్రాంతాల్లో పర్యటిస్తూ అధికారులకు సలహా సూచనలు చేస్తున్నారు. ఆమె స్వగ్రామం కర్ణాటక రాష్ట్రం చిత్రదుర్గ జిల్లా చళ్ళకెరె తాలూకా దొడ్డేరి గ్రామం. ఎస్‌బీఐ బ్యాంకు రిటైర్డు మేనేజర్ రుద్రముని కుమార్తె. ఇంజనీరింగ్ చదివిన ఆమె ప్రాథమిక విద్యాభ్యాసం దొడ్డేరి, చళ్ళకెరె, చిత్రదుర్గలలో ముగిసింది. ఉన్నత విద్యకోసం బెంగళూరుకు వచ్చి ఇంజనీరింగ్ పూర్తి చేశారు. ప్రైవేట్ సంస్థలో సుమారు రెడేళ్లపాటు పనిచేసి ఐఏఎస్‌లో ఉత్తీర్ణులయ్యారు. తిరువనంతపురం సహా పలు చోట్ల కలెక్టర్‌గా వ్యవహరించారు. కాగా చిత్రదుర్గ జిల్లా హిరియూరు హర్తికోటె గ్రామానికి చెందిన డాక్టర్ విక్రమసింహను పెళ్లాడారు. వారికి ఇద్దరు సంతానం. కాగా వయనాడ్ ఘటనకు సుమారు 20రోజులక్రితం కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ప్రస్తుతం అత్యవసర పరిస్థితులు కావడంతో నిరంతరం కార్యాచరణలో నిమగ్నమయ్యారు. చిత్రదుర్గ జిల్లాలోని డీసీ మేఘశ్రీ బంధువులతోపాటు మిత్రులు, క్లాస్‌మేట్స్ గర్వంగా భావిస్తున్నారు. ఓ కన్నడ మహిళ మానవత్వంతో చేస్తున్న సేవలు సంతోషం కలిగిస్తున్నాయని పలు కన్నడ సంఘాలు అభిప్రాయ పడ్డాయి.

ఆత్మరక్షణకు దోహదపడే కరాటే



శిబిరంలో కరాటే విద్యార్థులు, కోచ్‌లు

శిడ్లఘట్ట, ఆగస్టు 6: కరాటే అనేది ఆత్మరక్షణకు ఉపయోగించే ఒక కళ అని అంతే కాక శారీరక, మానసికస్థితిని మెరుగు పరుస్తుందని కరాటే కోచ్ చంద్రశేఖర్ అభిప్రాయపడ్డారు. పట్టణలోని అరళేపేటలోని బసవేశ్వర ఆలయ ఆవరణలో జైభారత్ కరాటె సంస్థ ఏర్పాటు చేసిన కుబుడో నాన్‌చాక్ తర్ఫీదు శిబిరంలో పాల్గొని మాట్లాడారు. ఆరోగ్యంతోపాటు క్రమబద్ధమైన జీవనానికి కరాటే దోహదపడుతుందన్నారు. శిబిరంలో పిల్లలకు కుబుడో నాన్‌చాక్ తరగతులను ట్రైనర్‌లు చంద్రశేఖర్, మహేశ్ నిర్వహించారు. శిబిరం పూర్తి చేసుకున్న వారికి కరాటే కోచ్ అరుణ్‌కుమార్ ప్రమాణపత్రాలను అందచేశారు.

నవోదయలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం విద్య, ఆగస్టు 6: నవోదయ విద్యాలయ సమితి 2025-26 ఏడాదికి సంబంధించి 6వ తరగతిలో ప్రవేశాలకు దరకాస్తులు చేసుకోవాలని డీఈఓ వరలక్ష్మి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 3వ, 4వ తరగతి ఉత్తీర్ణత సాధించడంతోపాటు, 2024-25లో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు, జిల్లాలో నివాసం ఉంటున్న విద్యార్థులు, 2013 మే 1 నుంచి 2015 జూలై 31 మధ్య జన్మించిన విద్యార్థులు అర్హులన్నారు. దరఖాస్తు చేయడానికి అక్టోబరు 16 చివరి తేదీ అని తెలిపారు. వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. నవోదయ. జీవోవి.ఇన్‌ను సంప్రదించాలన్నారు.

రేపు ఉద్యోగ మేళా

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 6: నిరుద్యోగ యువకుల కోసం గురువారం కు ఉద్యోగ మేళాను నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కళ్యాణి మంగళవారం ప్రకటనలో తెలిపారు. నవభారత్ ఫర్టి లైజర్స్ పేటీఎం సంస్థల్లో సేల్స్ రెప్రజెంటీవ్స్, ఫీల్డ్ ఎగ్జి క్యూటివ్‌గా పనిచేసేందుకు 210మంది అభ్యర్థులు కావాల న్నారు. పది నుంచి డిగ్రీ వరకు చదివిన వారు అర్హులని తెలిపారు. ఉపాధి కల్పనాధికారి కార్యాలయం లో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు.